సాక్షి
నంద్యాల
శనివారం । 15 । ఏప్రిల్ । 2023



.. కదిలే నిర్మాణం!

ఇంటి తరహా వాతావరణం కావాలన్నా.. వ్యాపారానికి అనువుగా ఉండాలన్నా ఇప్పుడు రెడీమేడ్ క్యాబిన్లు అందుబాటులోకి వచ్చాయి. వీటిని ఎంపిక చేసుకున్న స్థలంలో అమరుస్తున్నారు.

8లో▸



అలరించిన నృత్యప్రదర్శన

శ్రీశైలంటెంపుల్: క్షేత్రంలోని నిత్యకళావేదికపై హైదరాబాద్‌కు చెందిన ఎ.నాగధర్మవీర, దుర్గ కళానిలయం వారి నృత్యప్రదర్శన భక్తులను అలరించింది.



అన్నదాన పథకానికి విరాళం

శ్రీశైలంటెంపుల్: నిత్యాన్నదాన పథకానికి నంద్యాలకు చెందిన ఎం.జ్యోతి దంపతులు రూ.1,00,116 విరాళాన్ని అందించారు. వీరిని ఆలయ అధికారులు సత్కరించారు.

రంజాన్ వేళలు

	ఇఫ్తార్	సహెర్
కర్నూలు	సా॥ 6:38	ఉ॥ 4:39
ఆదోని	సా॥ 6:41	ఉ॥ 4:42
నంద్యాల	సా॥ 6:38	ఉ॥ 4:42
ఆత్మకూరు	సా॥ 6:36	ఉ॥ 4:36
బనగానపల్లె	సా॥ 6:41	ఉ॥ 4:36

హదీస్ వెలుగు :
తప్పులు చేసేటప్పుడు చుట్టూ చూసి ఎవరూ చూడటం లేదని అనుకోవద్దు. పైన ఆకాశం నుంచి అల్లాహ్ ప్రతిదీ చూస్తూ ఉంటాడు.
– పవిత్ర ఖురాన్

న్యూస్‌రీల్

పులి సంచారంపై అప్రమత్తంగా ఉండండి



పులి సంచరించిన ప్రదేశాలను పరిశీలిస్తున్న డీఎఫ్ఓ వినీత్ కుమార్, అటవీ సిబ్బంది

రుద్రవరం: పెద్దపులి సంచారంపై అప్రమత్తంగా ఉండాలని నంద్యాల డీఎఫ్ఓ వినీత్ కుమార్ రైతులకు సూచించారు. మండల కేంద్రమైన రుద్రవరానికి సమీపంలో గుమ్మకొండ ఉశేనయ్య స్వామి దర్గా పరిసరాల్లో పులి సంచరించినట్లు తెలుసుకున్న ఆయన శుక్రవారం ఆ ప్రాంతాన్ని పరిశీలించారు. పెద్దకంబలూరు సెక్షన్ వైపు నుంచి ఉశేనయ్య స్వామి దర్గా వైపు నుంచి వచ్చి అడవి లోపలికి వెళ్లినట్లు పెద్ద పులి పాదముద్రలు ఉన్నాయన్నారు. ఆహార అన్వేషణ, దాహం తీర్చుకోవడానికి బయటకు వచ్చి ఉండవచ్చని పేర్కొన్నారు. గతంలో పెద్దకంబలూరు వద్ద పెద్దపులి ఉచ్చులో పడి మృతి చెందిందని, అలాంటి ఘటన పునరావృతం కాకుండా ప్రత్యేక నిఘా ఉంచాలని అటవీ సిబ్బందిని అప్రమత్తం చేశారు. ఆయన వెంట రుద్రవరం రేంజి అధికారి శ్రీపతి నాయుడు, సెక్షన్ అధికారి నాగరాజు ఎఫ్‌బీఓలు ఉన్నారు.


17 నుంచి వర్క్‌షాప్

డోన్ టౌన్: స్థానిక ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో ఈ నెల 17, 18వ తేదీల్లో నేషనల్ అప్రెంటిషిప్ అవేర్‌నెస్ వర్క్ షాప్ నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ రాయపరెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 17వ తేదీ సోమవారం ఉదయం 10 గంటల నుంచి 5గంటల వరకు సంస్థలకు, 18వ తేదీ మంగళవారం ఒకేషనల్ కోర్సు విద్యార్థులకు అవేర్‌నెస్ కల్పించనున్నట్లు పేర్కొన్నారు.

నేడు జెడ్పీ స్థాయీ సంఘ సమావేశాలు

కర్నూలు(అర్బన్): జిల్లా పరిషత్ స్థాయీ సంఘ సమావేశాలు శనివారం ఉదయం 10.30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు నిర్వహించనున్నట్లు జెడ్పీ సీఈఓ జీ నాసరరెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి అధ్యక్షతన నిర్వహించే సమావేశాల్లో వివిధ శాఖలపై సమీక్ష నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. జెడ్పీలోని మినీ సమావేశ భవనంలో నిర్వహించే సమావేశాలకు ప్రభుత్వ శాఖలకు చెందిన అధికారులు, ఆయా స్థాయీ సంఘాలకు చెందిన చైర్‌పర్సన్లు, సభ్యులు నిర్ణీత సమయానికి హాజరు కావాలని సీఈఓ కోరారు.

మహానందీశ్వర దంపతులకు పల్లకీ సేవ



మహానందిలో పల్లకీ సేవ దృశ్యం

మహానంది: మహానందిలో కొలువైన శ్రీకామేశ్వరీ మహానందీశ్వర స్వామి వార్లకు శుక్రవారం రాత్రి పల్లకీ సేవ నిర్వహించారు. వేదపండితులు రవిశంకర అవధాని ఆధ్వర్యంలో స్వామి అమ్మవార్ల ఉత్సవ మూర్తులను అలంకరించి విశేష పూజలు చేపట్టారు. అనంతరం ఆలయ ప్రాకారాల్లో పల్లకోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో టెంపుల్ ఇన్‌స్పెక్టర్ హరినాథ్, అర్చకులు శరబయ్య శర్మ, హరి, భక్తులు పాల్గొన్నారు.

దుకాణాల వేలం వాయిదా

కర్నూలు(అగ్రికల్చర్): కర్నూలు వ్యవసాయ మార్కెట్ యార్డులో నూతనంగా నిర్మించిన 15 దుకాణాలకే వేలంపాట వాయిదా వేసినట్లు మార్కెట్ కమిటీ సెక్రటరీ గోవిందు తెలిపారు. ముందుగా నిర్ణయించిన ప్రకారంఈ నెల 15న వేలం నిర్వహించాల్సి ఉంది. అయితే మార్కెటింగ్ శాఖ జేడీ ఇతర కార్యక్రమాల కారణంగా రాలేకపోతుండటంతో వేలంపాటను ఈనెల 18కి వాయిదా వేసినట్లు శుక్రవారం తెలిపారు. మార్కెట్ కమిటీ నిధులతో పంప్‌హౌస్ రోడ్డులో 7 దుకాణాలు, మరో చోట 8 దుకాణాలతో వాణిజ్య సముదాయాలను నిర్మించామని, వీటిని వేలం ద్వారా కేటాయిస్తామన్నారు.

అసమ్మతి గళం

- లోకేశ్ పాదయాత్రలో టీడీపీ నేతల మధ్య విభేదాలు
- ధర్మవరం సుబ్బారెడ్డికి వ్యతిరేకంగా కరపత్రాల పంపిణీ
- డోన్ ఇన్‌చార్జ్‌గా తప్పించాలని కేఈ ప్రభాకర్ వర్గీయుల డిమాండ్
- పత్తికొండలో కురుబ, ఆలూరులో బోయల సమావేశం నిర్వహించే యోచనలో టీడీపీ
- కుల సంఘాల సమావేశాలపై తంటాలు పడుతోన్న పార్టీ, ఇన్‌చార్జ్‌లు



సాక్షి ప్రతినిధి కర్నూలు: యువగళం పేరుతో టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ చేస్తోన్న పాదయాత్ర ఆ పార్టీకి కొత్త కష్టాలు తెచ్చిపెడుతోంది. అవగాహన రాహిత్యంతో లోకేశ్ ఎప్పుడు, ఏం మాట్లాడుతారో అది పార్టీకి ఎంతలా నష్టం చేస్తుందో అని ఇన్‌చార్జ్‌లు సతమతమవుతున్నారు. మరోవైపు నేతల మధ్య విభేదాలు లోకేశ్‌కు తలనొప్పిగా మారాయి. టీడీపీలో చంద్రబాబుదే తుదినిర్ణయం కావడంతో తన వద్దకు వచ్చి సమస్యలు చెప్పిన వారికి ఏం సమాధానం చెప్పాలో కూడా తెలీక లోకేశ్ నీళ్లు నములుతున్నాడు. దీంతో నేతలు కూడా లోకేశ్‌కు ఏం చెప్పినా ఉపయోగం లేదనే నిర్ణయానికి వచ్చి అతన్ని తేలిగ్గా తీసుకుంటున్నారు. చివరకు కులసంఘాల సమావేశాల ఏర్పాటుపై కూడా లోకేశ్ నిర్ణయానికి విరుద్ధంగా ఇన్‌చార్జ్‌లు వ్యవహరిస్తున్నారు.

దళితులపై అనుచిత వ్యాఖ్యలు

ఉమ్మడి కర్నూలు జిల్లాలో పాదయాత్ర ప్రారంభమైన తొలిరోజే నారా లోకేశ్ దళితులపై అనుచిత వ్యాఖ్యలు చేశారు. 'దళితులు పీకిందేమీ లేదు, పొడిచిందేమీ లేదు' అని చేసిన వ్యాఖ్యలు రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశమయ్యాయి. దీనిపై దళిత సంఘాల నుంచి సర్వత్రా విమర్శలు వ్యక్తమయ్యాయి. ఇక రెండోరోజు పాదయాత్ర మొదలవ్వక ముందే నేతల మధ్య విభేదాలు భగ్గుమన్నారు. ధర్మవరం సుబ్బారెడ్డికి వ్యతిరేకంగా కేఈ ప్రభాకర్ వర్గం కరపత్రాలు పంపిణీ చేసింది. గుడిపాడు వద్ద లోకేశ్ బస చేసిన ప్రాంతంలో, ఆపై యాత్ర నడుస్తున్న సమయంలో కూడా కరపత్రాలు పంపిణీ చేశారు. ధర్మవరం సుబ్బారెడ్డిని డోన్ ఎమ్మెల్యే అభ్యర్థిగా చంద్రబాబు గతేడాది ప్రకటించారు. చంద్రబాబు ప్రకటన తర్వాత కేఈ ప్రభాకర్ నియోజకవర్గంలో సమావేశం నిర్వహించి డోన్ నుంచి కేఈ కుటుంబం పోటీ చేసి తీరుతుందని, సర్పంచ్ స్థాయిలేని వాళ్లు వచ్చి నియోజకవర్గంలో ఏం ఉద్ధరించేది లేదని పరోక్షంగా సుబ్బారెడ్డిపై వ్యాఖ్యలు చేశారు. టిక్కెట్ సుబ్బారెడ్డికి ఇస్తే ఇండిపెండెంట్‌గా పోటీ చేస్తామని పరోక్షంగా పార్టీకి కేఈ హెచ్చరికలు పంపారు. గతంలో కూడా బేతంచెర్లలో సుబ్బారెడ్డికి వ్యతిరేకంగా టీడీపీ శ్రేణులు కరపత్రాలు పంపిణీ చేశాయి.

డోన్ ఇన్‌చార్జ్‌గా వద్దు..

ఉదయం గుడిపాడు టెంట్‌లో కేఈ ప్రభాకర్ లోకేశ్‌తో చర్చించేందుకు వెళ్లారు. ఈ సమయంలోనే సుబ్బారెడ్డికి వ్యతిరేకంగా కరపత్రాలను టెంట్ బయట పంపిణీ చేశారు. సుబ్బారెడ్డితో పార్టీకి తీవ్ర నష్టం జరుగుతుందని, అతను కోవర్ట్ అని కరపత్రాల్లో పేర్కొన్నారు. వందలాది మంది టీడీపీ కార్యకర్తలు సుబ్బారెడ్డి తీరుతో నష్టపోయారని, అలాంటి వ్యక్తిని ఇన్‌చార్జ్‌గా తప్పించాలని అందులో కోరారు. కేఈ ప్రభాకర్ వర్గీయులే ఈ కరపత్రాలు వేశారని డోన్ నియోజకవర్గంలో ప్రతి కార్యకర్తకు స్పష్టంగా తెలుసు. ఇదే క్రమంలో పాదయాత్రలో కేఈ, ధర్మవరం వర్గాలు వేర్వేరుగా ఫ్లెక్సీలు వేయడం, నినాదాలు చేయడం చర్చనీయాంశమైంది.

కురబ, బోయల సమావేశంపై అంతర్మథనం

పాదయాత్రలో రోజుకో ఒక సమావేశాన్ని నిర్వహించేలా పార్టీ ప్రణాళిక రూపొందించుకుంది. తొలిరోజు దళితులతో లోకేశ్ ముఖాముఖి కార్యక్రమాన్ని నిర్వహించారు. పత్తికొండలో కురబ, ఆలూరులో బోయలతో సమావేశం నిర్వహించాలని పాదయాత్ర బృందం నిర్ణయించింది. అయితే ఆయా నియోజకవర్గాల ఇన్‌చార్జ్‌లు కేఈ శ్యాంబాబు, కోట్ల సుజాతమ్మ ఈ ప్రతిపాదనను తిరస్కరించారు. తమ నియోజకవర్గాల్లో ఈ సమావేశాలు వద్దని తేల్చిచెప్పినట్లు తెలుస్తోంది. పత్తికొండ, ఆలూరులో కురబ, బోయ వర్గాలు అధికంగా ఉన్నారని, లోకేశ్ ఆధ్వర్యంలో ఆయా వర్గాల వారు తమ కులం అభ్యర్థికే టిక్కెట్ కావాలని అడిగితే తమ గౌరవం పోతుందని, అలాంటి పరిస్థితి వస్తే లోకేశ్ ఏం మాట్లాడుతారో తెలీదని, లోకేశ్ అటు ఇటుగా మాట్లాడితే తమతో పాటు పార్టీకి చిక్కులు తప్పవని వాపోతున్నారు. దీంతో ఈ రెండు నియోజకవర్గాల్లో ఆ రెండు కులాల సభలు వద్దని తేల్చిచెప్పారు. పార్టీ మాటలు ఖాతరు చేస్తే ఎలా అని పాదయాత్ర టీం సభ్యులు విన్నవించినా శ్యాంబాబు, సుజాతమ్మ వినలేదని తెలుస్తోంది.

'భూమా' విలాపం!

ఆళ్లగడ్డలో భూమా కుటుంబంలో వర్గ విభేదాలు మరోసారి బట్టబయలయ్యాయి. 'భూమా వర్గీయుల ఆత్మీయ సమ్మేళనం' పేరుతో భూమా కిషోర్‌రెడ్డి నిర్వహించిన సమావేశం టీడీపీలో కొత్త ప్రశ్నలు రేకెత్తిస్తోంది. సార్వత్రిక ఎన్నికల పొత్తులో భాగంగా కిషోర్ పోటీ చేస్తారా? లేదంటే టీడీపీ ఆయననే అభ్యర్థిగా ప్రకటిస్తుందా? అనే చర్చ మొదలైంది. రాజకీయంగా తన వైఖరితో పాటు అఖిల, భార్గవ్ లక్ష్యంగా కిషోర్ తీవ్ర విమర్శలు చేశారు.

కుటుంబంలో మరోసారి అసమ్మతి చిచ్చు

- ఆత్మీయ సమావేశం పేరుతో అఖిల, భార్గవ్, జగత్‌పై భూమా కిషోర్ విమర్శలు
- ఆళ్లగడ్డ నుంచి పోటీ చేసి తీరుతానని ప్రకటన
- ఏవీ సుబ్బారెడ్డి, బీసీ జనార్దన్‌రెడ్డి అండతోనే కిషోర్ సమావేశమని టీడీపీ నేతల్లో చర్చ

సాక్షి ప్రతినిధి కర్నూలు: లోకేశ్ పాదయాత్ర జరుగుతున్న సమయంలో కిషోర్‌రెడ్డి సమావేశం చర్చనీయాంశమైంది. అఖిలపై విమర్శలు, తాను బరిలో ఉంటానని ప్రకటించడం రాజకీయంగా వేడి పెంచుతోంది. పొత్తులు ఉంటే బీజేపీ నుంచి.. లేదంటే మీరంతా అనుకుంటున్న పార్టీ నుంచి అని చెప్పడం ద్వారా పరోక్షంగా టీడీపీ తరపున పోటీలో ఉంటానని ప్రకటించారు. కొన్ని విషయాలు బహిర్గతం చేయలేనంటూనే టీడీపీతో టచ్‌లో ఉన్నాననే విషయాన్ని చెప్పకనే చెప్పారు. అయితే కిషోర్ ఏం మాట్లాడుతున్నారో తనకే స్పష్టత లేదనే చర్చ ఆళ్లగడ్డలో నడుస్తోంది. తాను ఏ పార్టీ తరపున పోటీ చేస్తానో స్పష్టత ఇవ్వకుండా ఏ పార్టీ వర్గానికి నాయకత్వం వహిస్తారని, అలాంటి వ్యక్తిని ఎవరు నమ్ముతారనే చర్చ కొనసాగుతోంది. బీసీ జనార్దన్‌రెడ్డి, ఏవీ సుబ్బారెడ్డి.. కిషోర్‌ను వెనుక ఉండి నడిపిస్తున్నారని తెలుస్తోంది. అఖిలకు టిక్కెట్ రాకుండా వీరిద్దరూ పొత్తులు ఉంటే బీజేపీ తరపున కిషోర్‌ను, లేదంటే టీడీపీ టిక్కెట్ దక్కేలా తెరవెనుక రాజకీయం చేస్తున్నారని ఆ పార్టీ కీలక నేతలు వ్యాఖ్యానిస్తున్నారు.

అఖిల, భార్గవ్‌పై తీవ్ర విమర్శలు

భూమా అఖిలప్రియ, భార్గవ్‌రామ్ వైఖరిపై కిషోర్ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. ఆళ్లగడ్డలో టీడీపీ పూర్తిగా బలహీనపడిందన్నారు. ఆళ్లగడ్డ రమేశ్‌రెడ్డి కమిషన్ ఇవ్వలేదని రూ.3కోట్లకు ఫోర్జరీ సంతకం చేసి చెక్‌బౌన్స్ అయిందని భార్గవ్ కేసు వేయించారన్నారు. చిన్నప్పటి నుంచి ఎత్తుకుని పెంచిన రమేశ్‌రెడ్డి పరిస్థితి ఇలా ఉందని, కమీషన్ల కోసం కార్యకర్తల రక్తం పీలుస్తున్నారన్నారు. వీరి వైఖరితో చాగలమర్రి రాంపల్లి రఘునాథరెడ్డిరెడ్డి, రామోహన్‌రెడ్డి, జగదీశ్‌రెడ్డి, వెంకట్రామిరెడ్డిలను భార్గవ్ అవమానించి పార్టీని వీడేలా చేశారన్నారు. ఆళ్లగడ్డ, దొర్నిపాడు మండలాల్లో చాలామంది కీలక నేతలు పార్టీ వీడారన్నారు. శివరామిరెడ్డి క్రషర్‌ను లాక్కోవాలని చూస్తే ఆయన దూరమయ్యారన్నారు. పాము తన పిల్లలు తానే తిన్నట్లు భార్గవ్, అఖిల కార్యకర్తలను తినేస్తున్నారని విమర్శించారు.

తేలిగ్గా తీసుకుందాం..

'భూమా' వర్గం అంటూ ఏదీ లేదని, అది పూర్తిగా బలహీనపడిందని కిశోర్ పరోక్షంగా అంగీకరిస్తున్నారు. తద్వారా టీడీపీ కూడా అత్యంత బలహీనమైందని ఆయన మాటల్లోని అర్థం. అయితే ఇదే సమయంలో భూమా వర్గానికి అండగా ఉంటానని చెప్పడం గమనార్హం. ఇదిలాఉంటే కిశోర్ సమావేశాన్ని అఖిల తేలిగ్గా తీసుకున్నట్లు తెలుస్తోంది. అతనొక పిచ్చోడని, అలాంటి వ్యక్తి మాటలు పట్టించుకోవల్సిన అవసరం లేదని.. అతని వెనుక ఎవరు ఉన్నారో? ఎలా ఆడిస్తున్నారో తనకు తెలుసని అఖిల తన అనుచరులతో చెప్పినట్లు తెలుస్తోంది. ఏదిఏమైనా ఆళ్లగడ్డలో అత్యంత దారుణంగా ఉన్న టీడీపీకి ఇలాంటి ఇంటిపోరు, వర్గపోరుతో మరింత నష్టం వాటిల్లనుంది.

మీ ఇంటి నిర్మాణం ఇలాగే చేపడతారా?



హుస్సేనాపురంలో గొర్రెల పెంపకం దారుల శిక్షణా కేంద్రం పనులను పరిశీలిస్తున్న మంత్రి బుగ్గన

- ప్రభుత్వ భవనాల నిర్మాణాల్లో నిర్లక్ష్యం తగదు
- అధికారులపై ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన ఆగ్రహం

ప్యాపిలి: 'నియోజకవర్గంలో చేపట్టిన అభివృద్ధి పనులపై తరచూ సమీక్ష నిర్వహిస్తున్నా.. అప్పుడేమీ మాట్లాడరు. క్షేత్ర పరిశీలనకు వస్తే పొంతన లేని సమాధానాలు చెబుతున్నారు.. మీ ఇంటి నిర్మాణం కూడా ఇలాగే చేపడతారా.. ప్లానింగ్ చేసుకోరా' అంటూ ఏపీ ఈడబ్ల్యూఐడీసీ అధికారులపై ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. మండల పరిధిలోని హుస్సేనాపురం గ్రామంలో రూ.8 కోట్లతో నిర్మిస్తున్న వెటర్నరీ పాలిటెక్నిక్ కళాశాల భవనం, రూ. 5 కోట్లతో నిర్మిస్తున్న గొర్రెల పెంపకం దారుల శిక్షణా కేంద్రం నిర్మాణ పనులను శుక్రవారం మంత్రి పరిశీలించారు. శిక్షణా కేంద్రం, వెటర్నరీ కళాశాలకు చెందిన వసతి గృహంలో ఏర్పాటు చేయాల్సి ఉన్న డైనింగ్ హాల్, కిచెన్, డార్మెటరీ, ఫర్నిచర్ గురించి ఏపీఈడబ్ల్యూఐడీసీ అధికారులను మంత్రి ప్రశ్నించారు. అందుకు అధికారులు పొంతన లేని సమాధానాలు చెప్పడంతో మంత్రి అసహనం వ్యక్తం చేశారు. 'భవన నిర్మాణ పనులన్నీ పూర్తి అయ్యాక ఫర్నిచర్ కోసం ప్రత్యేకంగా నిధులు ఎలా మంజూరవుతాయి.. రోడ్డు సమస్యను ఎందుకు నా దృష్టికి తేలేదు. అభివృద్ధి పనుల విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే సహించేది లేదు' అంటూ మండిపడ్డారు. కళాశాలకు రోడ్డు, ఫర్నిచర్ కోసం అవసరమైన ప్రతిపాదనలు వెంటనే సిద్ధం చేయాలని ఆదేశించారు. పనులలో నాణ్యత లోపించకుండా నాలుగు నెలల్లో నిర్మాణ పనులను పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. మంత్రి వెంట స్టేట్ మీట్ కార్పొరేషన్ చైర్మన్ శ్రీరాములు, జెడ్పీటీసీ సభ్యుడు శ్రీరామిరెడ్డి, మార్కెట్ యార్డ్ చైర్మన్ రాజా నారాయణమూర్తి, వ్యవసాయ సలహా మండలి చైర్మన్ వెంకటేశ్వరరెడ్డి, తహసీల్దార్ చంద్రశేఖరవర్మ, ఎంపీడీఓ ఫజుల్ రహిమాన్, షెప్పర్డు ట్రైనింగ్ సెంటర్ డీడీ శాంతయ్య, ఏడీ రామసుబ్బారెడ్డి, ఏపీడబ్ల్యూఐడీసీ డీఈ నాగరాజు, ఏఈ వెంకట్ రామిరెడ్డి, హుస్సేనాపురం సర్పంచ్ మహేశ్వర్ రెడ్డి తదితరులు ఉన్నారు.

అంబేడ్కర్ అడుగుజాడల్లో నడుద్దాం

- జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్
- ఘనంగా డాక్టర్ బాబా సాహెబ్ అంబేడ్కర్ జయంతి వేడుకలు
- నివాళులర్పించిన జిల్లా కలెక్టర్, ఎస్పీ, ఎమ్మెల్యే



కలెక్టరేట్‌లో కేక్ కట్ చేస్తున్న కలెక్టర్, ఎస్పీ, ఎమ్మెల్యే తదితరులు

నంద్యాల: అట్టడుగు, అణగారిన వర్గాలు, కార్మికులు, కర్షకుల సంక్షేమం కోసం రాజ్యాంగాన్ని రచించిన మహోన్నత వ్యక్తి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ అడుగుజాడల్లో ప్రతి ఒక్కరూ నడవాలని జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్ పేర్కొన్నారు. అంబేడ్కర్ 132వ జయంతి సందర్భంగా శుక్రవారం నంద్యాల పట్టణంలోని బొమ్మల సత్రం ఫ్లైఓవర్ బ్రిడ్జి కింద ఉన్న అంబేడ్కర్ విగ్రహానికి జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్, జిల్లా ఎస్పీ కె.రఘువీర్ రెడ్డి, స్థానిక ఎమ్మెల్యే శిల్పా రవిచంద్ర కిశోర్‌రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ మాబున్నిసా, వివిధ సంఘాల నాయకులు, అధికారులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టరేట్‌లోని వైఎస్సార్ సెంటినరీ హాల్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ముందుగా అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ ప్రపంచంలో ఎక్కడా లేని విధంగా భారత రాజ్యాంగాన్ని రూపకల్పన చేసి దేశానికి అందించిన చిరస్మరణీయుడు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ అని కొనియాడారు. ఆయన చేసిన సేవలు స్మరించుకుంటూ ఆయన చూపిన బాటలో నడవాలన్నారు. గొప్ప నాయకుడిగా, ఆర్థిక, రాజకీయ, సామాజిక సంస్కర్తగా గుర్తింపు పొంది భారతీయ గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయారన్నారు. దేశం ఆర్థిక సంక్షోభంలో కూరుకుపోకుండా ఆర్థిక సాధికారతకు మార్గం సుగమమం చేసిన మహనీయుడన్నారు.

- ఎమ్మెల్యే శిల్పా రవిచంద్ర కిశోర్ రెడ్డి మాట్లాడుతూ దేశం గర్వించదగ్గ మేధావుల్లో మహోన్నతుడు అంబేడ్కర్ అని కొనియాడారు. ఆయన కొందరి వాడు కాదని అందరి వాడని పేర్కొన్నారు. అంబేడ్కర్ చెప్పినట్లుగా దేశాభివృద్ధి పిల్లల చదువు మీద పైనే ఆధారపడి వుందని, ఇందుకోసం రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్యా రంగానికి పెద్దపీట చేశారన్నారు. అంతకుముందు అంబేడ్కర్ జయంతి సందర్భంగా కలెక్టరేట్‌లో కలెక్టర్, ఎమ్మెల్యే, ఎస్పీ, ఎస్టీ బీసీ సంఘాల నాయకులు కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ మాబున్నీసా, రాష్ట్ర హస్త కళల డైరెక్టర్ సునీత అమృతరాజ్, రాష్ట్ర ఆప్కో డైరెక్టర్ సుబ్బరాయుడు, మున్సిపల్ వైస్ చైర్మన్ పాంషావలి, జిల్లా విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యులు చిటికెల సలోమి, జీవన్ రాజు, మమతా రెడ్డి, ఎస్సీ,ఎస్టీ, బీసీ సంఘా ల నాయకులు బాలునాయక్, రమేష్ నాయక్, సాయిరాం రెడ్డి, శామ్యూల్, కోలా కల్యాణ్, గుంతాల ఈశ్వరయ్య, మున్సిపల్ కౌన్సిలర్లు, జిల్లాలోని వివిధ దళిత సంఘ నాయకులు, జిల్లా ప్రజా ప్రతినిధులు, అధికారులు,తదితరులు పాల్గొన్నారు.



అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళ్లు అర్పిస్తున్న కలెక్టర్ మనజీర్ జిలానీ, ఎస్పీ రఘువీర్‌రెడ్డి, ఎమ్మెల్యే శిల్పా రవి

'నాడు-నేడు' పనులు పూర్తి చేయండి

- సీఎస్ డాక్టర్ జవహర్‌రెడ్డి

నంద్యాల: రెండో విడత నాడు-నేడు కింద పాఠశాలల్లో చేపట్టిన పనులు వేసవి సెలవుల్లో యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి జవహర్ రెడ్డి ఆదేశించారు. శుక్రవారం విజయవాడలోని ముఖ్య కార్యదర్శి కార్యాలయం నుంచి వివిధ శాఖల కార్యదర్శులతో కలిసి జిల్లా కలెక్టర్లు, జేసీలతో సీఎస్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా వివిధ అంశాలపై సమీక్షించారు. నాడు-నేడు పాఠశాలల ప్రగతి, సుస్థిర అభివృద్ధి లక్ష్యాలు, కోవిడ్ నియంత్రణ, పంచాయతీ రాజ్, గ్రామీణ అభివృద్ధి, వేసవి కాలం దృష్ట్యా తీసుకోవాల్సిన చర్యలపై సమీక్షించారు. కలెక్టర్ చాంబర్ నుంచి కలెక్టర్‌తో పాటు జాయింట్ కలెక్టర్ నిశాంతి, వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎస్ మాట్లాడుతూ కోవిడ్ వ్యాప్తి నియంత్రణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటూ కోవిడ్ పరీక్షలు నిర్వహించడంతోపాటు అవసరమైన మందులను సిద్ధంగా ఉంచుకోవాలని సూచించారు. అనంతరం జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 974 పాఠశాలలో చేపట్టిన పనులు జూన్ 10 నాటికి పూర్తి చేస్తామని సీఎస్‌కి నివేదించారు. కోవిడ్ వ్యాప్తి చెందకుండా పటిష్టమైన చర్యలు తీసుకుంటూ అనుమానిత వ్యక్తులకు పరీక్షలు నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ డీఆర్‌ఓ కామేశ్వరరావు, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

అప్రమత్తతతోనే అగ్ని ప్రమాదాల నివారణ



పోస్టర్లు విడుదల చేస్తున్న కలెక్టర్, ఎస్పీ

నంద్యాల(అర్బన్): అప్రమత్తతతోనే అగ్ని ప్రమాదాలను నివారించవచ్చునని జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్, జిల్లా ఎస్పీ రఘువీర్‌రెడ్డి అన్నారు. ఈ నెల 14 – 20వ తేదీ వరకు నిర్వహించే అగ్నిమాపక వారోత్సవాల పోస్టర్లను స్థానిక జిల్లా కలెక్టర్ కార్యాలయంలో వారు ఆవిష్కరించారు. కార్యక్రమంలో నంద్యాల జిల్లా విపత్తు స్పందన, అగ్నిమాపక అధికారి జయన్న, సహాయ అధికారి యోగేశ్వరరెడ్డి, నాయకులు సాయిరాం రెడ్డి, సోమశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సీమ ప్రజల ఆదరణ మరువలేనిది



మాట్లాడుతున్న హీరో గోపీచంద్

కర్నూలు(టౌన్): రాయలసీమ ప్రజల ఆదరణ మరువలేనిదని సినీ హీరో గోపీచంద్ అన్నారు. కర్నూలు స్పోర్ట్స్ అథారిటీ స్టేడియంలో శుక్రవారం రాత్రి రామబాణం సినిమాలోని 'దరువెయ్యరా' పాట లాంచింగ్ ఆడియో కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గోపీచంద్ మాట్లాడుతూ తన 30వ సినిమాగా రామబాణం విడుదల కానుందన్నారు. హీరోయిన్ డింపుల్ హయతి మాట్లాడుతూ ఈ సినిమాలో నటించడం తన అదృష్టంగా భావిస్తున్నానన్నారు. దర్శకుడు శ్రీవాస్, నిర్మాతలు టీజీ విశ్వప్రసాద్, వివేక, మాజీ ఎంపీ టీజీ వెంకటేష్ పాల్గొన్నారు.

నాన్న వద్దు.. ఆస్తి ముద్దు

- వృద్ధాప్యంలో తండ్రిని పట్టించుకోని కుమారులు
- పొలం ఇవ్వకపోతే చంపేస్తామని బెదిరింపు
- పోలీసులను ఆశ్రయించిన వృద్ధుడు



కుమారులు దాడి చేయడంతో తగిలిన దెబ్బలను ఎస్ఐకి చూపుతున్న వృద్ధుడు జయరామిరెడ్డి

పగిడ్యాల: ఆస్తుల ముందు మానవ సంబంధాలు చిన్నబోతున్నాయి. జీవితంలో ఎన్ని కష్టాలు వచ్చినా వారసత్వంగా వచ్చిన ఆస్తిని విక్రయించకుండా కాపాడిన తండ్రిని ఇప్పుడు కొడుకులు కాదంటున్నారు. ఉన్నదాంట్లో కుమారులకు కొంత రాసిచ్చి తన జీవనం కోసం ఉంచుకున్న పొలాన్ని కూడా ఇవ్వాలని బెదిరిస్తున్నారు. తన కొడుకుల నుంచి ప్రాణహాని ఉందని ఓ తండ్రి పోలీసులను ఆశ్రయించాడు. ముచ్చుమర్రి పోలీస్ స్టేషన్ పరిధిలోని పడమర ప్రాతకోట గ్రామ పంచాయతీకి మజార గ్రామమైన రైతుపల్లెకు చెందిన చల్లా జయరామిరెడ్డి ఓ రైతు. పూర్వీకుల నుంచి అతనికి సంక్రమించిన 2.50 ఎకరాల భూమిని కౌలుకు వేసి వచ్చిన సొమ్ముతో సంసారాన్ని నెట్టుకొచ్చాడు. జయరామిరెడ్డి మొదటి భార్య సుబ్బమ్మకు చెన్నారెడ్డి, సుమన్‌కుమార్ రెడ్డి ఇద్దరు కుమారులు. సుబ్బమ్మ ఇరవై ఏళ్ల క్రితం మృతి చెందగా కుమారులకు పెళ్లిళ్లు చేసి చెరో అర ఎకరా పంపకం చేశాడు. ఆ తర్వాత జయరామిరెడ్డి రెండో పెళ్లి చేసుకోగా కుమార్తె శ్యామలమ్మ జన్మించింది. కుమార్తెకు కూడా పెళ్లి చేశాడు. రెండో భార్య పేరు మీద ఎకరా, మరో అర ఎకరా తన జీవనాధారంగా జయరామిరెడ్డి ఉంచుకున్నాడు. కాగా గుండె సంబంధిత వ్యాధితో బాధపడుతున్నా ఏనాడు పట్టించుకోని కుమారులు ఇటీవల పొలం రాసివ్వాలని దాడి చేశారని జయరామిరెడ్డి పోలీసులను ఆశ్రయించాడు. చంపేస్తామని బెదిరించిన కొడుకుల నుంచి రక్షణ కల్పించి ఆదుకోవాలని ఎస్ఐతో కన్నీరు పెట్టుకున్నాడు. ఎస్ఐ నాగార్జున స్పందిస్తూ.. విచారించి న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు.

క్లుప్తంగా

17న షూటింగ్ బాల్ జట్ల ఎంపిక

కర్నూలు (టౌన్): జిల్లా స్థాయి సీనియర్ షూటింగ్ బాల్ జట్ల ఎంపిక పోటీలు ఈనెల 17న ఉదయం 10 గంటలకు కర్నూలు బి.క్యాంపు క్రీడా మైదానంలో నిర్వహిస్తున్నట్లు జిల్లా షూటింగ్ బాల్ అసోసియేషన్ కార్యదర్శి నాగరాజు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులో ప్రతిభ చూపిన క్రీడాకారులు ఈనెల 23న అనంతపురం పట్టణంలో నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి షూటింగ్ బాల్ పోటీల్లో పాల్గొంటారని ఆయన తెలిపారు. ఆసక్తి కలిగిన క్రీడాకారులు రూ.20 ప్రవేశరుసుంతో నేరుగా హాజరు కావచ్చని తెలిపారు. వివరాలకు 9959051059 సెల్ నంబర్‌ను సంప్రదించాలన్నారు.

బీజేపీని సాగనంపుదాం

- సీపీఎం, సీపీఐ ఆధ్వర్యంలో ప్రచార భేరి

కర్నూలు(సెంట్రల్): మతోన్మాదాన్ని రెచ్చగొడుతున్న బీజేపీని సాగనంపి దేశాన్ని కాపాడుకునేందుకు ప్రతి ఒక్కరూ తమతో చేతులు కలపాలని వామపక్షాలు కోరాయి. శుక్రవారం సీపీఐ, సీపీఎం ఆధ్వర్యంలో ప్రచారభేరి కార్యక్రమాన్ని సీపీఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కె.ప్రభాకరరెడ్డి, సీపీఐ జిల్లా కార్యదర్శి బి.గిడ్డయ్య, సీపీఎం జిల్లా కార్యదర్శి డి.గౌస్‌దేశాయ్, సీపీఐ రాష్ట్ర నాయకుడు ఆవుల శేఖర్ ప్రారంభించారు. కలెక్టరేట్ నుంచి అంబేడ్కర్ భవన్ వరకు ర్యాలీ నిర్వహించి, అక్కడ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. దేశ సంపదను అంబానీ, ఆదానీలకు దోచి పెట్టడమే కాకుండా వారి సొమ్ములకు బీజేపీ ప్రభుత్వం కాపలాగా ఉంటోందని ఆరోపించారు. కార్యక్రమంలో రామకృష్ణారెడ్డి, రాజశేఖర్, రాముడు పాల్గొన్నారు.

జులాయిగా తిరగొద్దని మందలించడంతో ఆత్మహత్య



మృతిచెందిన ప్రమోద్

కర్నూలు: కుటుంబాన్ని పట్టించుకోకుండా నిత్యం మద్యం తాగుతూ జులాయిగా తిరుగుతున్నావంటూ తల్లిదండ్రులు మందలించడంతో కర్నూలు నగరం వడ్డేగేరికి చెందిన మాద్రి ప్రమోద్(17) ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. వడ్డేగేరిలో నివాసముంటున్న నాగరాజు, నాగమ్మ దంపతులకు ఇద్దరు కొడుకులు, ఇద్దరు కూతుర్లు సంతానం. చివరి వాడైన ప్రమోద్ గౌండా పని చేస్తున్నాడు. మద్యానికి బానిసై కొంతకాలంగా పనిచేయకుండా తిరుగుతున్నాడు. గతంలో వీరు బుధవారపేటలో ఉండగా మద్యం సేవించి అల్లరి చేస్తుండటంతో కాలనీ ప్రజలంతా కలసి ప్రమోద్‌కు దేహశుద్ధి చేయడంతో మకాం వడ్డేగేరికి మార్చారు. తండ్రి నాగరాజు స్కంద అపార్ట్‌మెంట్‌లో వాచ్‌మ్యాన్‌గా పనిచేస్తుండగా తల్లి నాగమ్మ హోటల్‌లో పనిచేస్తూ కుటుంబాన్ని నెట్టుకొస్తున్నారు. అయితే ప్రమోద్ మద్యం కోసం పలుమార్లు తల్లిని కొట్టి కూడా డబ్బులు లాక్కునేవాడు. గురువారం రాత్రి కూడా మద్యం సేవించి రాత్రి 11.30 గంటల సమయంలో ఇంటికి చేరుకుని అదుపుతప్పి ప్రవర్తిస్తుండటంతో తల్లిదండ్రులు గట్టిగా మందలించారు. వారిని బెదిరించేందుకని చెల్లెలి కూతురు కోసం గదిలో చీరతో కట్టిన ఉయ్యాలను గొంతుకు బిగించుకున్నాడు. కొద్దిసేపు తర్వాత తల్లిదండ్రులు గమనించి వెంటనే ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు ఒకటవ పట్టణ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఊహలకు రూపం.. కదిలే నిర్మాణం!

ఇల్లు కట్టి చూడు.. పెళ్లి చేసి చూడు అంటారు పెద్దలు. ఈ రెండింటిలో ఏది మొదలు పెట్టినా పూర్తయ్యే వరకు కంటి మీద కునుకు ఉండదు. ఎంత డబ్బు చేతిలో ఉన్నా రోజుకో కొత్త సమస్య వస్తూనే ఉంటుంది. ఇవే కాదు.. వ్యాపారం చేయాలన్నా సవాలక్ష ప్రశ్నలు. బిల్డింగ్ ఎంపిక.. పెట్టుబడి.. ఆలోచనకు అనువుగా గది వాతావరణాన్ని తీర్చిదిద్దుకోవడం.. ఇలా ఎన్నో. వందలు.. వేలు.. అయితే పర్వాలేదు కానీ, లక్షలతో ముడిపడిన వ్యవహారం కావడంతో ఆచితూచి అడుగులు వేయాల్సిన పరిస్థితి. ప్రపంచం వేగంగా అభివృద్ధి చెందుతున్న నేపథ్యంలో కూర్చున్న చోట అరచేతిలోని సెల్‌ఫోన్ అవసరమైన సమాచారాన్ని ముందుంచుతోంది. ఈ కోవలోనే ఇల్లు.. దుకాణం.. వ్యాపారం.. ఏదైనా సరే ఊహలకు అనుగుణంగా రూపుదిద్దుకుంటోంది. ఇనుప రేకులతో తయారవుతున్న 'క్యాబిన్' ఎన్నో ప్రశ్నలకు సమాధానంగా నిలుస్తోంది.



విస్తరిస్తున్న 'రెడీమేడ్ క్యాబిన్లు'

- అతి తక్కువ ఖర్చుతో ఏర్పాటు
- సులువుగా తరలించే అవకాశం
- ఆలోచనలకు తగినట్లుగా వాతావరణం
- ఆర్డర్ ఇస్తే చాలు రోజుల్లో సిద్ధం
- మారుతున్న ఆలోచనా ధోరణి

సాక్షి, కర్నూలు డెస్క్

కరోనా.. వ్యాపార ముఖచిత్రాన్నే కాదు, జీవన విధానంలోనూ ఎన్నో మార్పులకు కారణమైంది. బాగా బతికిన కుటుంబాలు కూడా తినేందుకు తిండి లేక వీధినపడ్డాయి. వ్యాపారులు ఎంతో మంది దుకాణాలకు బాడుగలు కూడా చెల్లించలేని పరిస్థితుల్లో ఊరు విడిచిన ఘటనలు కోకొల్లలు. ఇక అపార్ట్‌మెంట్లలో నివాసం భారం కావడంతో చాలా వరకు అరకొర డబ్బుకు అమ్మేసుకున్నారు. ఒకరి గురించి చెప్పాలంటే కరోనాకు ముందు, తర్వాత అని మాట్లాడుకోవాల్సిందే. ఈ నేపథ్యంలో ఇళ్ల విషయానికొస్తే ఊరికి దూరంగా ఆహ్లాదకర వాతావరణంలో నివాసం ఏర్పాటు చేసుకోవాలనే ఆలోచన వచ్చింది. ఇక వ్యాపారాలు అయితే.. ఒక్క రూపాయి పెట్టుబడి పెట్టాలన్నా ఆచితూచి అడుగులు వేయక తప్పని పరిస్థితి.

డబ్బును వృథా చేయకుండా..

కరోనా నేపథ్యంలో ప్రతి ఒక్కరికీ డబ్బు విలువ తెలిసివచ్చింది. ఇప్పుడు ఆ మహమ్మారి తగ్గుముఖం పట్టడంతో ఇల్లు కట్టుకోవాలన్నా, వ్యాపారంలోకి దిగాలన్నా తమకు తాము ఎన్నో ప్రశ్నలు వేసుకుంటున్నారు. ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషిస్తూ ఎందులోనైనా కాస్త డబ్బు మిగులుతుందేమోనని ఆలోచిస్తున్నారు. హంగూ ఆర్భాటాలకు పోకుండా ఉన్నంతలో హాయిగా జీవించేందుకు అవసరమైన సౌకర్యాలతో సరిపెట్టుకుంటున్నారు. విషయం ఏదైనా ఇంటర్నెట్‌ను శోధించి.. సామాజిక మాధ్యమాలను జల్లెడ పట్టి పది మందితో చర్చించి కానీ ఓ నిర్ణయానికి రాని పరిస్థితి.

'క్యాబిన్'లో కొత్తదనం

ఇంటి తరహా వాతావరణం కావాలన్నా.. వ్యాపారానికి అనువుగా ఉండాలన్నా ఇప్పుడు రెడీమేడ్ క్యాబిన్లు అందుబాటులోకి వచ్చాయి. పైకి సాదాసీదాగా కనిపించినా, లోపల కోరుకున్న విధంగా తీర్చిదిద్దుకునే అవకాశం ఉండటంతో ఇప్పుడు ఇవి అందరి దృష్టిని ఆకర్షిస్తున్నాయి. పార్టీషన్లతో అవసరమైన విధంగా ఆర్డర్ ఇస్తే చాలు.. ఎంపిక చేసుకున్న స్థలంలో ఇట్టే అమరుస్తున్నారు. నెలల తరబడి నిరీక్షించే పని లేకుండా, దగ్గరుంటేనే పని జరుగుతుందనే ఆలోచన అవసరం లేకుండా ఈ క్యాబిన్లు సరికొత్త స్వాగతం పలుకుతున్నాయి.

చదరపు అడుగును బట్టి ధర

క్యాబిన్ల తయారీని చదరపు అడుగులను బట్టి ధర నిర్ణయిస్తున్నారు. ప్రస్తుతం ఒక చదరపు అడుగుకు రూ.1,150లుగా వసూలు చేస్తున్నారు. కాఫీ షాప్, గెస్ట్‌హౌస్, ఫామ్ హౌస్, ఆఫీస్ క్యాబిన్లతో పాటు ఇప్పుడు ఏకంగా ఫంక్షన్ హాల్ క్యాబిన్లు సైతం అందుబాటులోకి రావడం విశేషం. ఇన్ని రోజుల్లోపు కావాలని చెప్పడమే తరువాయి.. ఆ మేరకు వీటిని సిద్ధం చేస్తున్నారు. జిల్లాలోనే తయారీ పరిశ్రమ ఉండటంతో ఎలాంటి సమస్య వచ్చినా సర్వీసు అందుబాటులో ఉండటంతో చాలా మంది వీటి పట్ల ఆకర్షితులవుతున్నారు. హైదరాబాద్ లాంటి మహానగరాల్లో చదరపు అడుగు ఇక్కడితో పోలిస్తే రూ.100 తక్కువ ఉన్నా.. సర్వీసులో ఇబ్బందులు ఎదురవుతున్నట్లు తెలుస్తోంది.

నాణ్యతకు పెద్దపీట

ఒక వస్తువు కొంటున్నామంటే ముందుగా నాణ్యతను పరీక్షిస్తాం. ఈ నేపథ్యంలో క్యాబిన్ల తయారీలో ఆధునిక సౌకర్యాలకు తోడు నాణ్యతకు పెద్దపీట వేస్తున్నారు. ప్రధానంగా క్యాబిన్‌ను ప్రాథమికంగా సిద్ధం చేసిన తరువాత వాటర్ లీకేజీ విషయంలో ప్రత్యేక శ్రద్ధ కనపరుస్తున్నారు. ఆ తర్వాతే పార్టీషన్, పెయింటింగ్ ఇతరత్రా పనుల్లోకి వెళ్తున్నారు. అదేవిధంగా అగ్ని ప్రమాదాలను కూడా తట్టుకునేలా వీటిని తీర్చిదిద్దుతున్నారు. మూడు నుంచి నాలుగు అడుగుల మందంలో ఈ క్యాబిన్లను తయారు చేస్తున్నారు. ఈ క్యాబిన్లను ఎంపిక చేసిన ప్రదేశాల్లో బేస్‌మెంట్ లేదా, రాడ్స్ సాయంతో ఏర్పాటు చేసుకుంటున్నారు.

ఆలోచనలకు తగినట్లుగా..



నాకు 1.25 ఎకరాల్లో ఫాంహౌస్ ఉంది. ఇక్కడ ఇల్లు కట్టుకుందామంటే విలువైన స్థలం వృథా అవుతుంది. పెట్టిన పెట్టుబడి కూడా తిరిగి వచ్చే అవకాశం లేదు. అన్నీ ఆలోచించి హైదరాబాద్‌లో చాలా చోట్ల చూసిన అనుభవంతో రెడీమేడ్ ఇంటిని కొనుగోలు చేశాం. దీన్ని సులభంగా ఇక్కడ ఏర్పాటు చేసుకున్నా. ఇందులోనే నాకు నచ్చిన విధంగా సౌకర్యాలు కల్పించుకోవడంతో పాటు వాష్‌రూం కూడా ఉంది. దగ్గరలోనే స్విమ్మింగ్ పూల్ ఏర్పాటు చేసుకుంటున్నా. ఖర్చు కూడా తక్కువే. కుటుంబ సభ్యులతో సేదతీరేందుకు అనువుగా ఉంది.

– జి.ఎస్.ప్రసాద్, ఆర్కిటెక్చర్, బేతంచెర్ల

అవసరమైన సౌకర్యాలతో..



మాకు సొంత ఇల్లు ఉంది. సమీపంలోనే కొంత ఖాళీ స్థలం ఉండటంతో మరో ఇల్లు కట్టుకుందాం అనుకున్నాం. ఇప్పుడున్న పరిస్థితుల్లో ఎంత చిన్న ఇల్లు అయినా రూ.10లక్షలు లేనిదే కష్టం. అది కూడా సవాలక్ష సమస్యలు. అందుకే బాగా ఆలోచించి క్యాబిన్ హౌస్ బాగుంటుందని ఇంటర్నెట్ ద్వారా తెలిసింది. కర్నూలు శివారులో తయారు చేస్తున్నారని తెలుసుకొని నాకు అవసరమైన సౌకర్యాలను వారికి తెలియజేశా. వారం రోజుల్లోనే నేను కోరుకున్న ఇల్లు సిద్ధమైంది. చుట్టూ కాంపౌండ్ వాల్ కట్టించుకున్నాం. ఇక్కడ కాకపోతే మా పొలానికైనా దీన్ని తరలించుకునే వీలుంది.

– కె.తులసీధర్‌రెడ్డి, నన్నూరు



కర్నూలు శివారు హైవేపై ఆకట్టుకుంటున్న టీ దుకాణం

కోరుకున్న విధంగా సిద్ధం

ఇల్లు కట్టుకోవాలనేది ప్రతి ఒక్కరి కల. స్థలం కొనాలన్నా లక్షలు పోయాల్సిందే.. ఆ తర్వాత కోరుకున్న విధంగా ఇల్లు నిర్మించుకోవాలంటే చేతి నిండా డబ్బు ఉండాల్సిందే. ఈ పరిస్థితుల్లో ఉన్న కాస్త స్థలంలో క్యాబిన్లతో నచ్చిన సౌకర్యాలతో ఇంటిని తలదన్నేలా క్యాబిన్లు సిద్ధం చేస్తున్నారు. వంట గది, వాష్‌రూమ్, ఇంకా ఎన్నెన్నో. మన కల వివరిస్తే చాలు.. క్యాబిన్‌లో సాకారం చేసి ఎంపిక చేసిన స్థలంలో అలా నిలిపేస్తున్నారు. వ్యాపారాల విషయంలోనూ ఇంతే.. దుకాణం ఎలా ఉండాలో చెబితే చాలు.. ఆవిధంగా అమర్చి ఎప్పుడు, ఎక్కడ, ఎలా కావాలో అలా తెచ్చి పెట్టేస్తున్నారు.



విక్రయానికి సిద్ధంగా ఆఫీస్ క్యాబిన్

బడ్జెట్‌కు అనుగుణంగా నిర్మాణాలు



ఎం.టెక్ పూర్తయ్యాక ప్రభుత్వ ఉద్యోగాల కోసం చాలా ప్రయత్నం చేశా. ఈ నేపథ్యంలోనే నేను ఎంచుకున్న ఫీల్డ్‌లోనే సొంతంగా వ్యాపారం ఎందుకు చేయకూడదనే ఆలోచన వచ్చింది. చాలా మంది తమ ఊహలకు అనుగుణంగా ఇల్లు, వ్యాపార దుకాణలు ఉండాలనుకుంటారు. అయితే అందుకు తగిన బడ్జెట్ లేక నిరుత్సాహ పడుతుంటారు. సిమెంట్, ఐరన్ రేట్లు ఎప్పటికప్పుడు పెరుగుతున్న పరిస్థితుల్లో క్యాబిన్స్‌తో అవసరమైన నిర్మాణాలను తయారు చేయడం చాలా సులువనే విషయాన్ని ప్రజల్లోకి తీసుకెళ్తున్నా. రాయలసీమలోనే మొట్టమొదటి తయారీ యూనిట్‌ను కర్నూలులో ఏర్పాటు చేశాం.

– ఎస్.ఉదయ్‌కుమార్, ఉదయ్ పోర్టబుల్ క్యాబిన్స్ అండ్ హోమ్స్ యజమాని



క్యాబిన్‌లో ఏసీ సదుపాయం



అధునాతన మరుగుదొడ్డి



కిచెన్‌లో వాష్‌బేసిన్

మద్యం అక్రమ రవాణాపై ఉక్కుపాదం

- అడిషనల్ ఎస్పీ ప్రసాద్



సి.బెళగల్‌లో వాహనాలతో మద్యం సీసాలను ధ్వంసం చేస్తున్న పోలీస్‌లు

సి.బెళగల్: మద్యం అక్రమ రవాణాపై ఉక్కుపాదం మోపుతున్నామని అడిషనల్ ఎస్పీ ప్రసాద్ అన్నారు. కోడుమూరు సర్కిల్ పరిధిలోని సి.బెళగల్, గూడూరు పోలీస్ స్టేషన్లలో గత సంవత్సరం నుంచి పట్టుబడిన అక్రమ మద్యాన్ని శుక్రవారం పోలీసులు ధ్వంసం చేశారు. ఈ కార్యక్రమాన్ని కర్నూలు డీఎస్పీ మహేష్‌తో కలిసి ఎఎస్పీ పర్యవేక్షించారు. ఈ సందర్భంగా అడిషనల్ ఎస్పీ మాట్లాడుతూ.. పొరుగు రాష్ట్రాల నుంచి మద్యాన్ని అక్రమంగా తరలించడంతోపాటు అమ్మకాలను చేపట్టే వారిపై కఠిన చర్యలు తీసుకుంటున్నామన్నారు. వారిపై క్రిమనల్ కేసులు నమోదు చేయడంతో పాటు వాహనాలను సీజ్ చేస్తున్నట్లు చెప్పారు. ఎస్పీ కృష్ణకాంత్ ఆదేశాల మేరకు పట్టుబడిన రూ.20.27 లక్షల విలువ చేసే మద్యాన్ని ఇనగండ్ల గ్రామ క్రాస్ రోడ్డు దగ్గర వాహనాలతో తొక్కించి ధ్వంసం చేసినట్లు చెప్పారు. కోడుమూరు సీఐ శ్రీధర్, ఎస్ఐ పీరయ్య, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

రేషన్ బియ్యం విక్రేతల అరెస్ట్



నిందితుల అరెస్ట్ చూపుతున్న ఎస్ఐ వేణుగోపాల్‌రాజు

మంత్రాలయం రూరల్: కర్ణాటక రాష్ట్రానికి రేషన్ బియ్యాన్ని తరలిస్తున్న ఇద్దరి వ్యక్తులను మంత్రాలయం పోలీసులు అరెస్ట్ చేశారు. ఎస్ఐ వేణుగోపాల్‌రాజు తెలిపిన వివరాల మేరకు.. ఎమ్మిగనూరు పట్టణం సంజీవయ్యనగర్‌కు చెందిన మాల వీరేష్, గొల్ల నరసింహులు గురువారం అర్ధరాత్రి దాటిన తర్వాత అశోక్‌లైలాండ్ వాహనంలో 36 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని కర్ణాటక రాష్ట్రం రాయచూర్‌కు చెందిన మల్లికార్జున అనే వ్యక్తికి విక్రయించేందుకు తరలిస్తున్నారు. మంత్రాలయం సమీపంలోని మాధవరం రహదారి వద్ద పోలీసులు వాహనాన్ని తనిఖీ చేయగా రేషన్ బియ్యం కనిపించాయి. వాహనాన్ని సీజ్ చేసి, ఇద్దరి వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. పట్టుబడిన రేషన్ బియ్యాన్ని రెవెన్యూ అధికారుల సమక్షంలో పంచనామా నిర్వహించి సివిల్ సప్లయ్ గొడన్‌కు తరలించామన్నారు. నిందితులను అరెస్ట్ చేసి ఎమ్మిగనూరు కోర్టులో హాజరు పర్చగా జడ్జి రిమాండ్‌కు ఆదేశించినట్లు ఎస్ఐ తెలిపారు.

కర్నూలులో రాష్ట్రస్థాయి రగ్బీ పోటీలు

కర్నూలు (టౌన్): నగర శివారులోని ఆదర్శ విద్యా మందిర్ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో ఈనెల 30 నుంచి మే 1,2 తేదీల వరకు రాష్ట్ర స్థాయి రగ్బీ పోటీలు నిర్వహిస్తున్నట్లు జిల్లా రగ్బీ సంఘం అధ్యక్షుడు గుడిపల్లి సురేందర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పోటీలు బాల బాలికల విభాగంలో ఉంటాయని పేర్కొన్నారు. ప్రతభ కనబరిచిన క్రీడాకారులను జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక చేస్తామన్నారు.

పూడ్చి పెట్టిన మృతదేహాలకు పోస్టుమార్టం

ఆళ్లగడ్డ: తన తండ్రి, నానమ్మ మృతిపై అనుమానం ఉందని ఓ యువకుడు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో పూడ్చి పెట్టిన మృతదేహాలకు శుక్రవారం పోస్టుమార్టం నిర్వహించారు. ఎస్ఐ వెంకటరెడ్డి తెలిపిన వివరాల మేరకు.. ఆళ్లగడ్డ పట్టణానికి చెందిన దూదేకుల రాము ఇంట్లో నిద్రిస్తూ ఈ ఏడాది జనవరి 6వ తేదీ ఉదయం మృతి చెందాడు. సహజ మృతిగా భావించిన కుటుంబ సభ్యులు అదే రోజు అంత్యక్రియలు నిర్వహించారు. మృతుడు రాము తల్లి జమాలమ్మ కూడా ఫిబ్రవరి 19వ తేదీన ఇంట్లో నిద్రిస్తూ మృతి చెందింది. కుమారుడిపై బెంగతో మృతి చెందిందని భావించి అంత్యక్రియలు నిర్వహించారు. ఈ క్రమంలో రాము కుమారుడు దూదేకుల తిరుపాలు తన తండ్రి రాము, నానమ్మ జమాలమ్మల మృతిపై పలు అనుమానాలు ఉన్నాయని పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో తహసీల్దార్ హరినాథరావు పర్యవేక్షణలో పూడ్చి పెట్టిన మృతదేహాలను శుక్రవారం తవ్వి బయటకు తీసి ఫోరెన్సిక్ నిపుణుడు డాక్టర్ హరికృష్ణ ఆధ్వర్యంలో పోస్టుమార్టం నిర్వహించినట్లు ఎస్ఐ తెలిపారు.

పత్తి ఫ్యాక్టరీలో భారీ అగ్ని ప్రమాదం

- ఆదోని పట్టణంలో ఘటన



మంటలు ఆర్పేందుకు ఫ్యాక్టరీ పైకి ఎక్కుతున్న సిబ్బంది



మంటలను అదుపు చేస్తున్న ఫైర్ సిబ్బంది

ఆదోని అర్బన్ : పట్టణంలోని మాధవరం రోడ్డులో నున్న నాగరాజు అండ్ సన్స్ ప్రెస్సింగ్ అండ్ జిన్నింగ్ ఫ్యాక్టరీలో శుక్రవారం తెల్లవారుజామున ఒంటి గంట సమయంలో షార్ట్ సర్క్యూట్‌తో భారీ అగ్ని ప్రమాదం చోటుచేసుకుంది. ఇందులో పత్తి గింజలు, జిన్నింగ్ అండ్ ప్రెస్సింగ్ మిషనరీలు, దూది బేళ్లు కాలిపోయాయి. జిన్నింగ్ జరుగుతుండగా ఒకచోట వైరు షార్ట్ సర్క్యూట్ కావడంతో మంటలు చెలరేగాయి. దీంతో పనిచేస్తున్న హమాలీలు వెంటనే అగ్నిమాపక కేంద్రానికి, ఫ్యాక్టరీ యజమానులకు సమాచారమిచ్చారు. అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని మంటలు ఆర్పి వేయడానికి ప్రయత్నించారు. రెండు ఫైర్ ఇంజిన్లు వచ్చినా మంటలు అదుపులోకి రాకపోవడంతో.. ఆలూరు, ఎమ్మిగనూరు నుంచి మరో రెండు ఫైర్ ఇంజిన్ల సాయంతో 25 మంది ఫైర్ సిబ్బందితో మంటలు అదుపులోకి తీసుకొచ్చారు. ఫ్యాక్టరీ యజమాని నాగరాజు మాట్లాడుతూ.. దాదాపు రూ.7 కోట్ల వరకు పత్తి విత్తనాలు, దూదిబేళ్లు, మిషనరీ ఉన్నాయని.. ప్రమాదంలో రూ.4 కోట్ల వరకు నష్టం వాటిల్లిందని ఆవేదన వ్యక్తం చేశారు. అగ్నిమాపక శాఖ జిల్లా అసిస్టెంట్ అధికారి యేసురత్నం మాట్లాడుతూ తమ సిబ్బంది కష్టపడి మంటలను అదుపులోకి తీసుకొచ్చారని.. దాదాపు రూ.3కోట్ల ఆస్తిని కాపాడారని తెలిపారు.

సాక్షి క్లాసిఫైడ్స్

EDUCATION

COACHING

■ APRJC, POLYCET, SHRESTA, (8&10 Classes) YASHASVI (8&10 Classes), నవోదయ సైనిక్ స్కూల్ల మొదలైన ప్రవేశ పరీక్షల కొరకు ప్రత్యేక కోచింగ్ ఇవ్వబడును. హాస్టల్ వసతి కలదు. సంప్ర: RIGHT Academy, KNL. Cell: 94939 02958 [L-799183]

PARAMEDICAL

■ B.Sc Nursing,BPT& Paramedical Courses Available. DMLT, Anesthesia, Dialysis, Cardiology, Cathlab, Opthalmic. Any Inter Eligible, Tirupati, 7416478396, 7416478395. [T-490]

REAL ESTATE

■ 'పద్మ రెసిడెన్సీ' అపార్ట్మెంట్ టీచర్స్ కాలనీలో 26 లక్షలు మొదలు Flats & పుల్లారెడ్డి డెంటల్ కాలేజ్ దగ్గరలో 78 లక్షలలో లగ్జరీ 3BHK హౌస్ & నూటిరెడ్డిపల్లి రోడ్ సూపర్ లగ్జరీ డూప్లెక్స్ హౌస్ అమ్మకమునకు కలవు. 90145 80500 [L-799168]

PLOT FOR SALE

■ Plot for sale : 4.5 Cents (30x66) South West Corner, Near Susheela Netralaya, Kurnool. suitable for poly clinics/ Diagnostics Centres. 99662 14999 [L-795198]

■ కర్నూలు సిటీకి 6 కి.మీ. దూరంలో చెన్నై to సూరత్ 6 లైన్ హైవేకు అతి సమీపంలో ఎర్రవందనం ఫాం ల్యాండ్స్, 44x50 సైజు గల ప్లాట్లు అమ్మకానికి కలవు. సంప్ర: లేపాక్షి 97030 03776 [L-799191]

■ కర్నూలు – ఓర్వకల్లు దగ్గర జయరాజ్ స్టీల్ ప్లాంటుకు వెళ్ళే దారిలో అతి తక్కువ ధరకు ఓపెన్ ప్లాట్లు కలవు. (30x40) స్పాట్ రిజిస్ట్రేషన్ చేసుకునే సౌకర్యం కలదు. క్రిష్ణమూర్తి – 95330 49765 [L-795199]

■ ఓర్వకల్లు–శకునాల సోలార్ పార్కు ప్రక్కన 30x40 (2.75 సెంట్లు) ఓపన్ ప్లాట్లు అమ్మకానికి కలవు. సెంటు 1.10 లక్షలు మాత్రమే. సంప్ర: నితిక డెవలపర్స్ 98884 24222 [L-799188]

FLAT FOR SALE

■ MS9 వారి కర్నూలు నగరం నందు ఎ.క్యాంప్, ప్రకాష్‌నగర్, బళ్లారి చౌరస్తా మరియు SBI మెయిన్ బ్రాంచ్ దగ్గరలో 2&3 BHK ఫ్లాట్స్ అమ్మకానికి కలవు. వివరాలకు సంప్ర: 85006 85357 [L-795195]

HOUSE FOR SALE

■ Kuda Approvalతో గణేష్ నగర్‌లో Padma's Residency అపార్ట్మెంట్‌లో 1,2,3 BHK Flats & పుల్లారెడ్డి డెంటల్ కాలేజ్ దగ్గరలో 77 లక్షలలో లగ్జరీ 3BHK హౌస్ & నూటిరెడ్డిపల్లి రోడ్ సూపర్ లగ్జరీ హౌస్ అమ్మకమునకు కలవు. 90143 35313 [L-799170]

LAND FOR SALE

■ కర్నూలు కోడుమూరు రోడ్డులో సల్కాపురం, నాగలాపురం మధ్యలో కుడా అప్రూవల్ డూప్లెక్స్ విల్లాస్ L.P.No. ప్రాజెక్ట్ ప్రక్కన 1.5 ఎకరాల పొలం అమ్మబడును. సెల్: 79955 44946 [L-799189]

LEASE/RENT

■ కర్నూలు కొత్త బస్టాండ్ వద్ద వసుంధర కాంప్లెక్స్‌లో తూర్పు ఫేస్ 3rd ఫ్లోర్ 9300 SFT బ్యాంక్స్, ఆఫీసులకు లీజు, అద్దె, అమ్మకంనకు కలదు. 80080 01740, 79979 24312 [L-2-2023]

TO - LET

■ ఎస్.ఆర్. పేట 9వ లైన్‌లో గ్రౌండ్ ఫ్లోర్‌లో తూర్పు ఫేస్ 2BHK వాస్తు అన్ని వసతులతో అద్దెకు కలదు. అద్దె 11,000/– PM సంప్ర : 83286 70236, 94409 10726 [L-799185]

■ దూపాడు నేషనల్ హైవేకి ఆనుకొని, కె.వి.సుబ్బారెడ్డి కాలేజి ప్రక్కన కొత్తగా నిర్మించిన 2BHK ఇండిపెండెంట్ హౌస్, కారు పార్కింగ్, 24 గంIIలు నీటి వసతి. MSS బాలాజీ వెంచర్‌లో అద్దెకు కలదు. 83286 70236 [L-799186]

WANTED

■ ఎమ్మిగనూరు ప్రముఖ హాస్పిటల్‌లో పనిచేయుటకు అనుభవం గల ల్యాబ్ టెక్నీషియన్స్, ఫార్మాసిస్ట్, స్టాఫ్ నర్సులు (Adult & Paedictric) ఆయాలు కావలెను. 98853 59143 [L-795197]

■ Work in Medical Agency Sales Girls & Computer Operator. Interested girls contact: B.Medical Agency. KNL. 90004 46665 [L-799190]

■ ప్రముఖ రియల్ ఎస్టేట్ కంపెనీ స్కంధాన్షి ఇన్‌ఫ్రా ప్రాజెక్ట్స్‌లో నంద్యాలలో పనిచేయుటకు మార్కెటింగ్ జాబ్స్ కలవు. సంప్ర: 97034 81989 [L-795192]

■ Wanted Lady Tele Callers to work in Reputed Educational Consultancy, Good Salary + Incentives, Qly: 10th, Cont: 93921 93029, 72072 99691 [L-795196]

■ ప్రముఖ ఫైబర్ కేబుల్ సంస్థ విజయవాడ మరియు గుంటూరు నందు ఫీల్డ్ వర్క్ చేయుటకు వర్కర్స్ కావలెను. నో క్వాలిఫికేషన్, శాలరీ 10-15వేలు, సెల్: 6300950372, 9347017891 [G-785909]

■ మీ ఇంటి వద్దనే వుండి మీ మొబైల్ ద్వారా మా కంపెనీ యొక్క Message పంపుతూ వారాని ₹3500/- సంపాదించుకోండి. వాట్సాప్ చేయండి. 9573633520, 9059633520 [M-1190666]

■ Swiggy (స్విగ్గి)లో పనిచేయుటకు డెలివరి బాయ్స్ అర్జంటుగా కావలెను. P/T, F/T కలదు. జాయినింగ్ బోనస్ 3000/- రీ జాయినింగ్ బోనస్ 3000/- సంప్రII 7989387436 [G-785904]

■ ప్రముఖ సంస్థ నందు మీ ఇంటి దగ్గర ఉంటూ పార్ట్/ఫుల్‌టైం పోస్టల్ కవర్లపై అడ్రస్‌లు వ్రాయుటకు స్త్రీ/పురుషులు కావలెను. జీతంః 15000+ ఇన్సెంటివ్స్. ఫ్రీ బుక్‌లెట్ కొరకు 9059509586 [G-785740]

■ VIP's ఇంట్లో పేషెంట్‌ని చూసుకోదానికి స్త్రీలు/పురుషులు అర్జెంటుగా కావలెను.ఆయా,వార్డ్ బాయ్స్ ,నర్సులు, వంటవారు, RMP. Dr. Q:5th- డిగ్రీ, 10-30వేలు జీతం. భో+రూం ఫ్రీ. Hyd. 7993583999 [HA-46]

■ త్రివేణి హోంకేర్ హైదరాబాద్ నందు వృద్దులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్ / నర్సులు కావలెను. ఫ్రీ వసతి+భోజనం. జీ: 18K. ఏజెంట్ కమీషన్. 3K. Ph: 9848571888 [H-793413]

■ Hydలో ప్రముఖ ఇ-కామర్స్, ఫార్మా, MNC కంపెనీలకై హెల్పర్స్, ప్యాకర్స్, సూపర్ వైజర్స్, సెక్యూరిటీ గార్డ్స్, కేటరింగ్ బాయ్స్ కావలెను. రూం, భోజనం ఫ్రీ. జీ. 15,000-30,000. ఫోన్.8367003580 [HA-10718]

■ శ్రీరామ్ ఫైనాన్స్ లిII కర్నూల్, ఆదోని, ఎమ్మిగనూరు, నంద్యాల, డోన్ బ్రాంచిలలో లీగల్ & రికవరీ విభాగాలలో పనిచేయుటకు డిగ్రీ పూర్తి అయిన 30 సంIIలోపు వయసు గల అభ్యర్థులు కావలెను. సంప్రII 7995070891 & 9866501464. [A-682]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.



సాక్షి క్లాసిఫైడ్స్ వింగ్
94909 94349
94412 10725
4 Lines Classified Rs. 300/-
For Extra Line Rs. 75/-
Classified Display Rs. 215/-



స్టూడెంట్ నుండి మార్కెటింగ్ పర్సన్‌గా మారాలని భావిస్తున్నారా ?

జీవితంలో గెలవండి...

మీ కోసం సాక్షి అందిస్తున్న సువర్ణావకాశం.

సాక్షి దిన పత్రికకు కర్నూలు, నంద్యాల, ఆదోని పట్టణ పరిసర ప్రాంతాలలో చందాదారులను చేర్పించడానికి

సేల్స్ ప్రమోటర్స్ యువతి/ యువకులు కావలెను.

ఆకర్షణీయమైన జీతం మరియు టి.ఏ. ఇవ్వబడుతుంది.

టార్గెట్ అధిగమించినవారికి ఇన్సెంటివ్‌కూడా ఇవ్వబడును.

అర్హతలు: 10వ తరగతి పాస్ అయివుండవలెను.

ఇంటర్ /డిగ్రీ - పాస్ /ఫెయిల్ అయిన వారికి ప్రాధాన్యత ఇవ్వబడును.

వయస్సు: 18సంIIలు పైబడి 30సంIIలు లోపు ఉండవలెను.

యువతి/యువకులు తమ వాక్చాతుర్యంతో ఎదుటి వారిని ఆకట్టుకొని మెప్పించి ఒప్పించే నేర్పు మార్కెటింగ్ ఉద్యోగం పై ఆసక్తి ఉన్నవారు బయోడేటా, 2 పాస్‌పోర్టు సైజు ఫోటోలు, సర్టిఫికెట్ జిరాక్స్ కాపీలతో ఈ క్రింది తెలిపిన మా ప్రాంతీయ కార్యాలయంలలో సంప్రదించండి.

ఇంటర్వ్యూతేది: 17-04-2023
సోమవారం ఉ. 10.00 నుండి మ. 2.00 వరకు

K.Rami Reddy, Manager (Cir)
Cell: 99124 40495

సాక్షి ప్రాంతీయ కార్యాలయాలు

సెంట్రల్ ప్లాజా, వినాయక ఘాట్ ఎదురుగా, సెల్: 73311 19910 – కర్నూలు

సెల్: 83283 88497, 90103 68007 – నంద్యాల

సెల్: 79979 58284, 93982 35634 – ఆదోని